క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



రెడ్డిగూడెం: రెడ్డిగూడెంలోని అభ్యుదయ యువశక్తి సంఘం నందు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం నందు 49 మందికి కంటి వైద్య పరీక్షల నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు చింతిరాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరంలో వైద్యులు చింతిరాల ఫ్లారెన్స్, పల్లెపాం లక్ష్మీకుమారి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో ఎనిమిది మందికి కంటిలో పొరలు ఉన్నట్లు గుర్తించి విజయవాడలోని చైతన్య కంటి ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సెక్రటరీ చింతిరాల సావిత్రి, సంఘ కోశాధికారి ఝాన్సీ, సభ్యులు వెంకటరావమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత



రామచంద్రాపురం(ఎ.కొండూరు): మండలంలోని రామచంద్రాపురంలో దివ్యాంగులకు హోప్ ఆర్గనైజేషన్ కంభంపాడు వారి ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహారాన్ని సంస్థ డైరెక్టర్ దాసరి సతీష్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒక గ్రామాన్ని ఎంచుకుని ఆ గ్రామంలో ఉన్న దివ్యాంగులకు కంది పప్పు, వేరు శనగలు, బెల్లం, గోధుమ పిండి, సబ్బులు, దుప్పట్లు, నూతనవస్త్రాలు అందిస్తున్నామన్నారు. ఈ సంస్థకు సహాయ సహకాలు అందించిన హెచ్ఎం రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ బి.విశ్వభారతి, ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కె.లక్ష్మణరావు, వై జాన్ అనిల్, కే పవిత్రకుమార్ పాల్గొన్నారు.

మోడల్ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ




కొండపల్లి(ఇబ్రహీంపట్నం): టెన్త్‌క్లాస్ విద్యార్థుల్లో పరీక్షల భయం దూరం చేసేందుకు ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్న ప్రజ్ఞా వికాస మోడల్ పరీక్ష విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరావు పేర్కొన్నారు. కొండపల్లి క్రాంతి హైస్కూల్, ఇబ్రహీంపట్నం జెడ్పీ పాఠశాలల్లో పరీక్ష వాల్‌పోస్టర్లు క్రాంతి స్కూల్ చైర్మన్ వెనిగళ్ల మురళీమోహన్‌తో కలసి బుధవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ రూపొందించిన ప్రశ్నపత్రం, ఓఎంఆర్ షీట్‌తో 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఆసక్తిగల విద్యార్థులు 90108 49524లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

హుండీ కానుకల లెక్కింపు



పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేల మారెమ్మ దేవస్థానంలో హుండీ కానుకలను దేవదాయశాఖ తనిఖీదారు ఎ.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి వెంకట సత్యశేష సునీల్, పోలీసులు, రెవెన్యూ అధికారులు భక్తుల సమక్షంలో బుధవారం లెక్కించారు. 71 రోజులకు గాను రూ.6,87,413 వచ్చినట్లు ఆలయ ఈఓ సీతారామయ్య తెలిపారు.

సీఎస్ఐ కౌన్సిల్ సభ్యుడు కొల్లూరి మార్కు మృతి



ఆగిరిపల్లి: మండలంలోని కనసానపల్లి సీఎస్ఐ చర్చి కౌన్సిల్ సభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కొల్లూరి మార్కు (67) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మార్కు మాస్టారు మండలంలో 30 ఏళ్లకు పైగా ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాస్టర్లు బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

ఎమ్మెల్యే రక్షణనిధి



శాంతినగర్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువైందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. తిరువూరు నగరపంచాయతీ ఏడో వార్డు శాంతినగర్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను త్వరితగతిన ప్రజలకు అందే విధంగా గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో వార్డుల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. సచివాలయాల ఏర్పాటుతో ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు సచివాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో మీసేవా కేంద్రాల ద్వారా లభ్యమయ్యే అన్ని ప్రభుత్వ సేవలూ సచివాలయాల్లో లభ్యమవుతున్నాయని తెలిపారు. వార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కమిషనర్ బాలకృష్ణ, జెడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, మోదుగు ప్రసాద్, ఏరువ ప్రకాష్‌రెడ్డి, పరసా సత్యనారాయణ, సుందరకుమార్, మూడు దుర్గారావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, పార్టీ నాయకులు మస్తాన్, నల్లబోతుల రమాదేవి, రఫీ పాల్గొన్నారు.

సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి



వలసపల్లి సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాణి

మునునూరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండి సమగ్ర సేవలు అందించాలని ఎంపీడీఓ జి.రాణి ఆదేశించారు. మండలంలోని వలసపల్లి గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పథకాల వ్యాప్తి అమలులో నిర్లిప్తత, నిర్లక్ష్యాన్ని, అనుమతిలేని గైర్హాజరీని, అధికార దుర్వినియోగాన్ని ఎట్టి పరిస్థితిలోనూ సహించబోమని హెచ్చరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులు, పోషకాహారాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ దామోదర్, పర్యవేక్షకుడు సాయిరాము, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

లైబ్రేరియన్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ఇబ్రహీంపట్నం శాఖ గ్రంథాలయ అధికారిపై తనిఖీ అధికారికి ఫిర్యాదు చేస్తున్న పాఠకులు

ఇబ్రహీంపట్నం: స్థానిక శాఖ గ్రంథాలయంలో అందుబాటులో ఉండని లైబ్రేరియన్ దీపికపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు గ్రంథాలయ తనిఖీ అధికారి సీహెచ్ శ్రీనివాసరావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కుంచం ఫణి, అద్దెపల్లి ఆంజనేయులు తదితరులు నిత్యం గ్రంథాలయానికి వెళ్తుంటారు. ఉదయం 8.30 గంటలకు తెరవాల్సిన గ్రంథాలయం 10 గంటల తెరవడం వలన ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థులు పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో గ్రంథాయలం అందుబాటులో లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గ్రంథాలయంలో ఉండాల్సిన హాజరు బయోమెట్రిక్ ఇంటికి తీసుకువెళ్లడంపై నిలదీశారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

జింకు లోపం నివారణపై శిక్షణ



తిరువూరు మండలం మునుకుళ్లలో పొలంబడి

మునుకుళ్ళ(తిరువూరు): వరిపొలాల్లో జింకులోపం కారణంగా ఎదుగుదల తగ్గిపోతుందని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు జీ కెన్నడీ తెలిపారు. మండలంలోని మునుకుళ్లలో మేలైన సాగు పద్ధతులపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. జింక్ లోపం ఉన్న పొలాల్లో ఆకుల మధ్య ఈనె పాలిపోవడం, నాటిన రెండు నుంచి నాలుగు వారాల్లో ముదురాకు చివర్లలో, మధ్య ఈనెకు ఇరు పక్కల తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు కనబడతాయని ఏడీఏ సూచించారు. ఆకులు చిన్నవిగా, పెలుసుగా ఉండి విరిగిపోతాయని, ఈ లక్షణాలు గమనించిన వెంటనే లీటరు నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్‌ను ఐదు నుంచి ఏడు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ పద్మ, రైతుభరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో సైన్స్ డే వేడుకలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తూనుకుంట్ల శ్రీనివాసు, అధ్యాపకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో సైన్స్ డే వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు చెప్పారు. సైన్స్ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆ కళాశాల కమిటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూనుకుంట్ల శ్రీనివాసు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 27, 28 తేదీల్లో వేడుకలు జరుగుతాయన్నారు. 27న ఎనిమిది, తొమ్మిది తరగతి విద్యార్థులకు సైన్స్ స్టోరీ టెలింగ్, పోస్టర్ ప్రజెంటేషన్, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ పోటీలు, పదో తరగతి విద్యార్థులకు పిరియాడిక్ టేబుల్ క్విజ్, కార్బన్ మాల్ మేకింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 28న యూజీ, పీజీ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించటంతో పాటు సమకాలీన అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేడుకల కన్వీనర్ డాక్టర్ టి.భాగ్యకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, కె.మోహన్‌బాబు(షైన్) షైన్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ జి.కృష్ణవేణి పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు కృషి

మునునూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ కె.రాజానాయన పేర్కొన్నారు. లోపూడి గ్రామ శివారు బాసవరప్పాడులో రూ.35 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న నూతన బోరు, పైపులైన్ల నిర్మాణ పనులను సర్పంచ్ పేరం కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలకు మంచినీటి సౌకర్యం కోసం నూతన బోరుతోపాటు మూడు కిలోమీటర్ల పొడవైన పైపులైన్ నిర్మాణం వేగంగా పూర్తి చేసి గ్రామ ప్రజలకు ప్రతి ఇంటికీ సమృద్ధిగా మంచినీరు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముప్పా బాబూరావు, గ్రామ సచివాలయ కన్వీనర్ బండారుపల్లి నరేష్, పొన్నగంటి రమేష్, ఆవుల పోతురాజు పాల్గొన్నారు.

రౌడీషీటర్ బాబీ నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడ స్పోర్ట్స్: రౌడీషీటర్ సందక దుర్గారావు అలియాస్ బల్లిగుడ్డు అలియాస్ క్రైం బాబీ నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. విజయవాడ మాచవరానికి చెందిన క్రైం బాబీ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పలు మార్లు ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. అనేక సార్లు జైలు జీవితం అనుభవించినా అతనిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో గతేడాది జూలైలో నగరం నుంచి బహిష్కరించారు. అయినా అతనిలో మార్పు రాలేదని, నగరంలోకి వస్తే మరిన్ని ఘర్షణలకు పాల్పడి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాడనే నిఘా వర్గాల సమాచారంతో బహిష్కరణను పొడిగించామని సీపీ తెలిపారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

గుణదల(విజయవాడతూర్పు): మేరీమాత పుణ్యక్షేత్రంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న నవదిన ప్రార్థనలు బుధవారంతో ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. పలు విచారణల భక్తులు, మఠకన్యలు, పుణ్యక్షేత్ర గురువులు జపమాలలు ధరించి కొండపై కి చేరుకున్నారు. మరియమాత స్వరూపం వద్ద జరిగిన సమష్టి బలి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ దేవుని వాక్య సందేశం అందించారు. ఆయన మాట్లాడుతూ.. మరియమాత చల్లని దీవెనలు భక్తులందరిపై ఉంటాయన్నారు. మరియ తల్లిని ఆశ్రయించిన భక్తుల జీవితాలు ఆనందంగా ఉంటాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆ నిష్కళంక మాతకు విధేయులుగా ఉండాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్య బలిపూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ అనిల్, ఫాదర్ థామస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నూజివీడు: పట్టణంలోని ఇండోర్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఎన్టీఆర్ కాలనీ, 11 కేవీ ఆర్టీసీ ఫీడర్లలో నూతన లైన్ల నిర్వహణ కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ డీ.కృష్ణనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగినపల్లితోట ప్రాంతం, రాజీవ్‌సర్కిల్ ఏరియా, నెహ్రూపేట, బాపూనగర్, బస్టాండు ఏరియా, ఎన్టీఆర్ కాలనీ, కొన్నంగుంట రోడ్డు, మున్సిపల్ కార్యాలయం సెంటర్, వెంకటేశ్వరస్వామి కోవెల రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చల్లగుండ్లవారిపాలెం(గంపలగూడెం): పెనుగొలను–2 సచివాలయం పరిధిలోని చల్లగుండ్లవారిపాలెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఆధ్వర్యంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

వలసపల్లిలో..

మునునూరు: మండలంలోని వలసపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, సకాలంలో హాజరుకావాలని కోరారు.

వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

మైలవరం: స్థానిక ద్వారకా తిరుమల దత్తత దేవాలయం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు ఈ నెల 1నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా తిరు కల్యాణ మహోత్సవంలో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం రాత్రి శ్రీపుష్పయాగోత్సవం, ద్వాదశ ప్రదక్షిణలు జరిగాయి. అనంతరం పవళింపు సేవా కార్యక్రమం జరిగింది.

సొసైటీలను సందర్శించిన చైర్మన్ ఆంజనేయులు

రెడ్డిగూడెం: పాడి రైతు సంక్షేమం మన మతం, అలుపెరగని సేవ మన అభిమతంలో భాగంగా బుధవారం మండలంలోని రాఘవాపురం, రెడ్డిగూడెం సొసైటీలను చైర్మన్ చలసాని ఆంజనేయులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి రైతులు, సంఘ అధ్యక్షులు, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలలో తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మైలవరం క్లస్టర్ మేనేజర్ కోట ప్రసాద్, రాఘవాపురం అధ్యక్షురాలు తిరుమలదేవి, రెడ్డిగూడెం అధ్యక్షురాలు డి.సీతారావమ్మ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఆగిరిపల్లి: మండలంలోని ఈదర, సీతారామపురం గ్రామాల్లోని రేషన్ దుకాణాలపై విజిలెన్స్, రెవెన్యూ అధికారులు మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఈదరలో రామస్వామికి చెందిన రేషన్ దుకాణంలో రెండు క్వింటాళ్ల బియ్యం, సీతారామపురంలోని రేషన్ దుకాణంలో 15 క్వింటాళ్ల బియ్యం తేడా వచ్చింది. ఇద్దరు డీలర్లపై 6ఏ కేసు నమోదు చేసినట్లు సీఎస్ డీటీ జి.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ఈదరలో ఎండీయూ వ్యాన్ డ్రైవర్ రాబర్ట్ వ్యానులో 15 బస్తాల బియ్యం ఎక్కువగా ఉండటంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు.

రూ.6.18 లక్షల అపరాధ రుసుం వసూలు

ఇబ్రహీంపట్నం: వివిధ గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు ఆశాఖ విజయవాడ రూరల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. తనిఖీలపై 40బృందాల సభ్యులకు విధివిధానాలు బుధవారం వివరించారు. అక్రమ విద్యుత్ వినియోగం, అదనపులోడు, వివిధ కేటగిరీల మార్పు, రెండుమీటర్ల ఏర్పాటు గుర్తించి రూ.6.18 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే 94408 12085కు ఫోన్ చేయాలన్నారు. ఫోన్‌చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంటాయన్నారు. విజిలెన్స్ డీఈఈ నవీన్‌కుమార్, ఇబ్రహీంపట్నం, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం డీఈఈలు కొండలరావు, రమేష్, గోవిందరాజులు, సుధకర్, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. గొల్లపాలెంగట్టు సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన లక్ష్మీమహతి 2013లో మీసాల ప్రశాంత్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ప్రశాంత్ బస్టాండ్ క్యాంటీన్‌లో క్యాషియర్‌గా పని చేస్తుంటాడు. కొంత కాలంగా ప్రశాంత్ మద్యానికి, బెట్టింగులకు బానిసై భార్య, పిల్లలను పట్టించుకోవడం లేదు. రోజూ తాగి వచ్చి భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యాభివృద్ధికి దాతల సేవలు ప్రశంసనీయం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, డాక్టర్ హనిమిరెడ్డి

మైలవరం: మైలవరంలో విద్యాభివృద్ధికి ప్రవాసాంధ్రులు, ప్రముఖ కార్డియలజిస్ట్ లకిరెడ్డి హనిమిరెడ్డి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లహరి, లిటరరీ, కల్చరల్, స్పోర్ట్స్ మీట్(ఏ సర్జ్ ఆఫ్ సెలెబ్రేటింగ్ యూత్) కార్యక్రమం బుధవారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇక్ల రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మైలవరం పరిసరాలలో లకిరెడ్డి సోదరులు విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవన నిర్మాణాలు చేపట్టారన్నారు. అదేవిధంగా మైలవరంలో కేజీ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల విద్య వరకు ఇక్కడే చదువుకునే అవకాశం కలిపించారన్నారు. భవిష్యత్‌లో డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి సహకారంతో ఇతర విద్యా కళాశాలలు కూడా ఏర్పాటు చేస్తారన్నారు. డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. తాము పడిన కష్టాలు నేటి తరం అనుభవించ కూడదని స్థానికంగా విద్యార్థులకు విద్యావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

నల్ల తామరను ఉల్లి ద్రావణంతో అధిగమించవచ్చు



ఉల్లి ద్రావణం తయారు చేయడంపై అవగాహన కల్పిస్తున్న విజయకుమారి

గణపవరం(మైలవరం): మామిడిలో సీజనల్‌గా వచ్చే నల్ల తామర పురుగును ఉల్లి ద్రావణం అగ్నాస్త్రం ద్వారా అధిగమించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ డీఎంఎఫ్ విజయకుమారి తెలిపారు. మైలవరం మండలం గణపవరంలో జీ.20 ఈవెంట్స్‌లో భాగంగా నేషనల్ కో–ఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఎన్టీఆర్ జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో బుధవారం సమావేశం జరిగింది. రైతుల అనుభవాలను తెలుసుకుని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఏ పంటకు ఏ రకమైన కషాయాలు, ద్రావణాలు పిచికారీ చేయాలని విషయాలు వివరిస్తూ ప్రధానంగా మామిడిలో వచ్చు నల్ల తామర పురుగు నివారణకు ఉల్లి ద్రావణం పిచికారీ చేయాలన్నారు. నవ ధాన్యాలు పంట వలన కలుగు లాభాలు, పెరటి తోటలు వేయడం వలన కలుగు లాభాలు వివరించి, తద్వారా నేల ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను తీసుకోవచ్చని తెలియజేశారు. ఈ సందర్భంగా అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం డెమో రూపంలో తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో బి.భాను, కో–ఆర్డినేటర్ ఎ.వాణి, గ్రామ ఉద్యాన సహాయకులు బి.మహేష్, నాగేశ్వరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

టీనేజీలో గర్భధారణ తల్లీబిడ్డకు ప్రమాదం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నూజివీడు: టీనేజీలో గర్భధారణ అనేది ప్రమాదకరమే కాక ప్రాణాంతకం అని దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తరావిచర్ల, బోర్వంచలలో టీనేజీ ప్రెగ్నెన్సీ(బాలికల గర్భధారణ)పై మహిళలకు, కిశోర బాలికలకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భధారణ సరైన సమయంలో జరిగితేనే తల్లీబిడ్డ ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. అలా కాకుండా టీనేజీలోనే గర్భం దాల్చడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ ప్రమాదమేనని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేయడమే బాలికల గర్భధారణకు కారణమన్నా ఎవరైనా సరే ఆడపిల్లకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 సంవత్సరాల వయసు నిండకుండా ముందుగానే వివాహం చేసినట్లయితే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బాలికలు గర్భం ధరించడం వల్ల వారి చదువును మధ్యలోనే నిలిపివేయాల్సి వస్తోందని, దీంతో వారి భవిష్యత్ దెబ్బతింటోందన్నారు. టీనేజ్‌లో గర్భం దాల్చడం వల్ల ఎక్కువ సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుండటంతో హైబీపీకి లోనవుతారని, దీంతో అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. బ్యాల వివాహాలు చేసినట్లయితే రెండేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. కార్యక్రమంలో బోర్వంచ సర్పంచ్ కుంటం ఉదయరాజు, సీహెచ్‌వో షేక్ దవాల్, పీహెచ్ఎన్ సీహెచ్ కృష్ణకుమారి, హెచ్‌వీ ఝాన్సీ, హెచ్ఎస్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



మైలవరంలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

మైలవరం: కర్నూలు జిల్లా డోన్ బార్ అసోసియేషన్ కోశాధికారి, న్యాయవాది పులి దామోదర్‌పై కొంత మంది దుండగులు దాడి చేసి హత్యాయత్నం చేయడాన్ని నిరసిస్తూ మైలవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం తమ విధులు బహిష్కరించారు. న్యాయవాది పులి దామోదర్ డోన్ పట్టణంలో జరుగుతున్న మెడికల్ మాఫియాపై ఆర్టీఐ ద్వారా సమాచారం సేకరించేందుకు ఆర్జీ దాఖలు చేశారు. దీనిని ఆసరాగా తీసుకుని మెడికల్ మాఫియా గతంలో ఒక సారి దాడి చేసి తీవ్రంగా గాయపర్చడం, మళ్లీ సోమవారం ఉదయం దామోదర్‌పై హత్యాయత్నానికి పూనుకోవడం దారుణమని, దుండగులను వెంటనే అరెస్టు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లోనే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే తీసుకొచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విధులు బహిష్కరించిన వారిలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముల్లంగి రవికుమార్, సీనియర్ న్యాయవాదులు పీవీ శేషగిరిరావు, ఎస్వీకే సత్యనారాయణరావు, బుద్దవరపు వెంకట్రావు, వీటీ కిశోర్, ఏడీ ప్రసాద్, కార్యదర్శి ఎం. శరత్‌బాబు, సహాయ కార్యదర్శి పి.రాము, రవికిశోర్, ఎం. తనూజ్ పాల్గొన్నారు.

సొంత నిధులతో పాఠశాల భవన నిర్మాణం



జోరుగా సాగుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం

వెల్వడం(మైలవరం): ప్రవాసాంధ్రులు, విద్యాదాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తన సొంత నిధులతో వెల్వడం గ్రామంలోని లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణాన్ని చేపట్టారు. వెల్వడంలోని లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులు ఊడి పడుతుండటంతో స్థానికులు, పాఠశాల యాజమాన్యం డాక్టర్ హనిమిరెడ్డి, విజయలక్ష్మి దంపతులకు ఈ విషయం తెలియజేయడంతో వారు స్పందించి సుమారు రూ.3కోట్ల అంచనాలతో రెండంతస్తుల భవనం, 18 తరగతి గదులతో అదే ప్రాంగణంలో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టారు. డాక్టర్ హనిమిరెడ్డి దంపతులు గతంలో మైలవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత నిధులు సుమారు రూ.8కోట్లతో స్థలం సేకరించి, రెండంతస్తుల భవన నిర్మాణాన్ని చేపట్టారు. అదేవిధంగా మాతృ భూమి మీద మమకారంతో మైలవరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి డాక్టర్ హనిమిరెడ్డి తన సొంత నిధులు అందజేసి సహకరించారు. కాగా డి. తిరుపతిరెడ్డి నిరంతర పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.